క్లుప్తంగా

ఉద్యోగభద్రత కల్పించండి



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యార్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఆ అసోసియేషన్ నేతలు మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీతను కోరారు. మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని, యార్డ్ అసిస్టెంట్లు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ అన్ని విషయాలను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసిస్ నాయకులు పీవీ కిరణ్, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వానరం మృతి

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో ఓ వానరం ప్రమాదవశాత్తును విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. శుక్రవారం రాత్రి వర్షం కురువడంతో గ్రామంలో ఓ విద్యుత్ తీగ తెగి వేలాడుతోంది. ఆ వానరం తీగను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై కింద పడి చనిపోయింది. గమనించిన గ్రామ ప్రజలు వానరానికి పూజలు చేసి, గ్రామ శివారులోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో అంత్యక్రియలు నిర్వహించారు.

20న బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని బావిపల్లి గ్రామంలో ఈ నెల 20వ తేదీ బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలతో పాటు మొత్తం 12 బహుమతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 6305427212, 6304108994 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో జారీ

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్‌కు మెమో ఇచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను సోమ, మంగళ, బుధవారాల్లో ఏపీఓ శ్రీవిద్యతో పాటు టీఏలు పరిశీలించారన్నారు. అయితే సోమవారం 400 మంది కూలీలు హాజరు కాగా మంగళ, బుధవారాల్లో 275 మంది మాత్రమే పనులకు హాజరైనట్లు గుర్తించినట్లు తెలిపారు. కానీ మస్టర్లలో మాత్రం కూలీలు పనికి హాజరు కాకపోయినా హాజరైనట్లు నమోదు చేసి కూలీల నుంచి రూ.200 చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ మేరకు నోటీసు అందిన రెండు రోజుల్లో రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ఫీల్డు అసిస్టెంట్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

యువకుడి దుర్మరణం

డోన్ టౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిగురమానుపేటకు చెందిన మణిధర్ కుమారుడు జానీ(24) మృతి చెందాడు. వర్షం కురుస్తున్న సమయంలో బైక్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెళుతుండగా అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. పట్టణ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'బండలాగుడు' విజేత సంజామల వృషభాలు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాలపండ్ల విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన 20 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. సంజామల మండలం ముక్కమల్లకు చెందిన ముసాని చంద్రశేఖరరెడ్డి వృషభాలు నిర్ణీత 15 నిమిషాల వ్యవధిలో 3,110 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో రూ.60 వేలు కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా కొల్లపారకు చెందిన మాధవరెడ్డి వృషభాలు 3064.8 అడుగుల దూరంతో రెండో స్థానంలో రూ. 50 వేలు, ఇదే జిల్లా సంతమాగులూరు తేజశ్రీరెడ్డి వృషభాలు 3045.2 అడుగుల దూరంతో మూడో స్థానంలో రూ. 40 వేలు, దొర్నిపాడు బత్తుల కృష్ణయ్య యాదవ్ 2950 అడుగుల దూరం లాగి నాల్గో స్థానంలో రూ. 30 వేలు దక్కించుకున్నాయి. ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లెకు చెందిన ఉప్పరి లక్ష్మీదేవి వృషభాలు 2789.4 అడుగుల దూరంతో ఐదో స్థానంలో రూ. 20 వేలు, గడివేముల మండలం గడియరేవులకు చెందిన సంజయ్‌కుమార్ వృషభాలు 2331.8 అడుగుల దూరంతో ఆరో స్థానంలో నిలిచి రూ. 15వేలు, గెలుపొందాయి.

కుండపోత వర్షం



నగరంలో కురుస్తున్న వర్షం



అశోక్‌నగర్‌లో రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు

- నగరంలో జలమయమైన పలు కాలనీలు
- రోడ్లెక్కి ప్రవహించిన మురుగునీరు
- ఇబ్బందులు పడిన ప్రజలు, వాహనదారులు

కర్నూలు (టౌన్/సిటీ): నగరంలో కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు దాదాపు రెండున్నర గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురవడంతో పలు కాలనీలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలివానకు కరెంటుపోవడంతో నగరం మొత్తం చీకటిమయంగా మారింది. వర్షానికి మురుగు కాల్వలు నిండిపోయి రోడ్ల మీద పారాయి. దీంతో కాలనీవాసులు వాహనాదారులు, పాదాచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కృష్ణా నగర్, న్యూకృష్ణా నగర్, ఆదిత్య నగర్‌లలో మురుగు కాల్వల సమస్య తీవ్రంగా ఉంది. ఏడాది కాలంగా మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని ఇక్కడి స్థానికులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. స్థానిక అశోక్ నగర్ అండర్ బ్రిడ్జి, నరసింహారెడ్డి నగర్‌కు వెళ్లే రహదారిలో రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. ఈ రహదారి గుండా వెళ్లే వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక 17 వ వార్డు పరిధిలోని ఏ. క్యాంపు, చైతన్యపురి కాలనీలలో ఇదే పరిస్థితి. డ్రైయిన్లు నిండి ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చింది. ఇక 4 వ వార్డు పరిధిలోని కుమ్మరి వీధిలో ఇటీవల నూతనంగా డ్రైయిన్ నిర్మించారు. అయితే ఇది ఎత్తులో ఉండటంతో వర్షం నీరు వెళ్లలేక కాలనీలో నిలిచిపోయింది. నగరంలో పారిశుద్ధ్య పనులు సరిగ్గా జరగకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైయినేజీలు రోడ్లెక్కి ప్రవహిస్తున్నాయని వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు.ఇకనైనా మునిసిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌లోని పార్కింగ్ ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో కుంటను తలపించింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అష్టకష్టాలు



ఆర్టీసీ పార్కింగ్ ప్రాంగణం వర్షపు నీటితో నిండిపోవడంతో వాహనదారుల అవస్థలు



ఏ. క్యాంపులో ఇళ్ల వద్దకు చేరిన వర్షపు నీరు

కారును ఢీ కొట్టిన బైక్

- ఒకరు మృతి
- ఇద్దరికి తీవ్రగాయాలు



మృతి చెందిన ఆనంద్

ఆలూరు రూరల్: హులేబీడు గ్రామం సమీపంలోని హైవే 167 వద్ద శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పల్సర్ బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టారు. దీంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా..మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..ఆదోని నుంచి ఆలూరు వైపునకు వస్తున్న జైలో కారును ఆస్పరి నుంచి ఆలూరు మీదుగా హొళగుంద మండలం వందవాగిలికి పల్సర్ బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకు లు హులేబీడు గ్రామం సమీపంలోని మారెమ్మ గుడి వద్ద వేగంగా ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఆస్పరి మండలకేంద్రానికి చెందిన తిమ్మన్న, శకుంతలమ్మ కుమా రుడు ఆనంద్ (19) అక్కడికక్కడే మృతి చెంద గా, పూర్ణ, తిమ్మప్ప అనే యువకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆదోనికి తరలించారు. ఆలూరు ఎస్‌ఐ మహబూబ్ బాషా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వందవాగిలిలో సోదరి పెళ్లికి స్నేహితులతో కలిసి వెళ్తుండగా ఈ ఘటన జరగడంతో ఆనంద్ కుటుంబంలో విషాదం నెలకొంది.

గోల్డెన్ అవర్ ఎంతో ముఖ్యం



అత్యవసర వైద్యంపై శిక్షణ పొందిన వైద్యులు, విద్యార్థులతో అధికారులు

కర్నూలు(హాస్పిటల్): హార్ట్ అటాక్ విషయంలో గోల్డెన్ అవర్ ఎంతో ముఖ్యమని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. వైద్యుల్లో నైపుణ్యాలను అప్‌డేట్ చేసేందుకే నిరంతర శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజిలో అనెస్తీషియా విభాగం ఆధ్వర్యంలో పీజీ వైద్యులకు రెండు రోజులుగా 'కాంప్రహెన్సివ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ విషయంలో గోల్డెన్ అవర్ చాలా ముఖ్యమని, ఎంత త్వరగా రోగికి వైద్యం ప్రారంభిస్తే అంత మెరుగైన ఫలితాలు ఉంటాయని ఆమె చెప్పారు. అందువల్లే ఈ అంశంపై నూతనంగా వస్తున్న మెలకువలను వైద్యులకు నేర్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు గుండెనొప్పి విషయంలో అనేక అపోహలు ఉన్నాయని, అత్యవసర సమయంలో సమయం వృథా కాకుండా వైద్యులు చికిత్సకు ఉపకరించేందుకు వారికి మెలకువలు నేర్పించడం ద్వారా రోగులకు సత్వర వైద్యసహాయం అంది ప్రాణాలు కాపాడటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, అనెస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్‌కుమార్, ప్రొఫెసర్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ రామశివనాయక్, కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ రాణి మంజూష, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

వేసవి తాపంపై 'బీట్ ద హీట్'



అధికారులు ఎదుట బీట్ ద హీట్‌పై ప్రదర్శన ఇస్తున్న వైద్య విద్యార్థులు.

కర్నూలు(హాస్పిటల్): వేసవి ఎండల దృష్ట్యా ప్రజలను జాగృతం చేసే కార్యక్రమంలో భాగంగా ×బీట్ ద హీట్÷ అంటూ శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఇంటర్నీస్ వైద్య విద్యార్థులు చక్కటి స్కిట్ ప్రదర్శించారు. వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, తమ ఇంటిలో, గ్రామంలో ఎలాంటి ప్రథమ చికిత్స చేయవచ్చు, ఏ పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రికి తరలించాలి అన్న అంశాల గురించి స్కిట్‌లో ప్రదర్శించారు. అనంతరం వారిచే ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ సింధియా శుభప్రద, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ సుధాకుమారి, రేడియాలజి హెచ్‌ఓడీ డాక్టర్ రాధారాణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ద్రవిడ వర్సి టీ వీసీ దొరస్వామి నాయుడు, తదితరులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కుప్పం ద్రవిడ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.దొరస్వామి నాయుడు అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థను వీసీతో పాటు తిరుపతి ఎస్వీయూ ప్రొఫెసర్ కె.సురేంద్ర బాబు, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, గ్రంథాలయ శిక్షణాలయం అధినేత రాష్ట్ర గ్రంథాలయ సంఘం రాష్ట్ర కార్యదర్శి రావి శారద, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, గాడిచర్ల హరిసర్వోత్తమరావు మనుమడు మనోహర్‌రావు తదితరులు సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గ్రంథాలయం నిర్వహణ బాగుందని అభినందించారు. పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల మెటీరియల్ అందుబాటులో ఉండటంతో విద్యార్థులు, నిరుద్యోగార్థులకు ఉపయుక్తమవుతుందని చెప్పారు. అంతకు ముందు గాడిచర్ల విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.గోవిందరెడ్డి, ఎస్ బాషా, రేణుక, శీను, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.


వ్యాయామంతో రక్తపోటు దూరం



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని జిల్లా అసంక్రమిత వ్యాధుల కార్య నిర్వహణ అధికారి శైలేష్‌కుమార్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని కోడుమూరులో వైద్య సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శేలేష్ కుమార్ మాట్లాడుతూ.. శారీరక శ్రమ లేకపోవడం, జీవనశైలిలో మార్పులు, పనిభారం, ఆహారపు అలవాట్ల వల్ల అధిక రక్తపోటుకు గురై ప్రపంచంలో ఏటా 10 లక్షలకు పైగా జనాలు చనిపోతున్నారన్నారు. కావున ప్రజలంతా శారీరక శ్రమ చేయడంతో పాటు, పొగాకు ఉత్పత్తులు, మద్యం అలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చన్నారు. రక్తపోటు నివారణలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఎన్‌సీడీ సర్వే నిర్వహించి రక్తపోటు ఉన్న వారిని గుర్తించి మందులను అందజేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ మల్లికార్జున, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ సుధాకర్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాభాయి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డీఈఈ హరి

ఆదోని అర్బన్: రాయితీపై ఇంటిపై సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకుని విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవడంతో పాటు ఉత్పత్తి అయిన విద్యుత్‌తో ఆదాయం పెంచుకోవచ్చని విద్యుత్‌శాఖ డీఈఈ హరి, ఏడీఈ పురుషోత్తం అన్నారు. శనివారం స్థానిక డీఈఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటి పైకప్పు నుంచి సోలార్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. దీంతో విద్యుత్ ఆదా చేసుకోవడంతోపాటు ఆదాయం పెంచుకుని, ఓల్టేజ్ సమస్యలు, అంతరాయం లేకుండా విద్యుత్ పొందవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఈ పథకాన్ని అందిస్తుందన్నారు. ఒక కిలో వ్యాట్ సామర్థ్యంతో 120 యూనిట్లు వస్తుందని, ఇందుకు ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. కేవలం మధ్యతరగతిలో ఉన్న గృహిణిలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, పరిశ్రమలకు, హోటళ్లకు, ఆసుపత్రులకు, అపార్ట్‌మెంట్లకు ఈ పథకం వర్తించదని తెలిపారు.

1న రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఈత పోటీలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 1 వ తేదీ నరసరావుపేటలో 10 వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఈత సంఘం సంయుక్త కార్యదర్శి రామక్రిష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల మధ్యలో పుట్టిన స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 18 వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్యన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈత కొలనులో సంప్రందించాలని సూచించారు. పాల్గొన దలచిన ఈత క్రీడాకారులు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్డు తప్పక కలిగి ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 85000 54005 సెల్ నంబర్ సంప్రదించాలని చెప్పారు.

22న హనుమాన్ జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్: సీతారాముల కల్యాణ మహోత్స వ సమితి ఆధ్వర్యంలో ఈనెల22వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సాయంత్రం 5.30 గంటల నుంచి రామాయణ పారాయణం, ధార్మిక ప్రసంగాలు, హనుమాన్ చాలీషా పారాయణం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా యుద్ధం విజయోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భారత త్రివిధ దళాలకు సంఘీ భావం తెలుపుతూ ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ రక్షణ దళానికి మరింత బలం, శక్తిని కలిగించి విజయం ఎల్లవేళలా చేకూరాలని స్వామి వారిని స్మరించుకుంటూ హనుమాన్ చాలీషా పారాయణం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కారు-ఆర్టీసీ బస్సు ఢీ

- ఒకరికి గాయాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు-కర్నూలు మార్గంలోని ప్యాలకుర్తి సమీపంలో శనివారం కారు, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. కోడుమూరుకు చెందిన షబ్బీర్ వ్యక్తిగత పనిపై కారులో కర్నూలుకు వెళ్లి తిరిగివస్తుండగా, ప్యాలకుర్తి వద్ద ఎదురుగా వస్తున్న పత్తికొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న షబ్బీర్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

జాతీయ సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక

ఆలూరు: గుజరాత్‌లో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఖేల్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయస్థాయి బీచ్ గేమ్స్ పోటీల్లో రాష్ట్రం తరపున ఆలూరు గ్రామానికి చెందిన కురుబ మధను ఎంపిక చేశారు. ఈనెల 7న కర్నూలులో జరిగిన సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ సభ్యులు ఆలూరు గ్రామానికి చెందిన కురుబ మధును ఎంపిక చేశారు. మధు గతంలో చైనాలో జరిగిన అంతర్జాతీయ సెపక్ తక్రా పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చాటాడు. పీఈటీలు కవిరాజ్, హనుమంతరెడ్డి, చిన్నబాబు, గుత్తినాగరాజ్, వీరేష్ అభినందించారు.

ఆకట్టుకున్న ప్రవచనం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై వీరభద్ర విజయంపై ఒంగోలుకు చెందిన పొన్నూరు వెంకట శ్రీనివాసులు ప్రవచన కార్యక్రమం ఆకట్టుకుంది.

సామాజిక సేవే ధ్యేయం

ఎమ్మిగనూరుటౌన్: బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడమే తమ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ అన్నారు. పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టారేణుక సహకారంతో బుట్టా ఫౌండేషన్ ద్వారా రూ.4లక్షల విలువ చేసే జనరేటర్‌ను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన కళ్యాణ మండపంలో జనరేటర్‌ను ప్రారంభించగా ఆయనను పద్మశాలీ సంఘ నాయకులు, పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు విశ్వనాథ్ రమేష్, సంఘ నాయకులు సత్కరించి బుట్టా దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజాహితం కోరి సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిలా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, పట్టణ నాయకులు కోటకొండ నరసింహులు, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పట్టణంలోని 4వ వార్డులో ఈనెల 15వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన చేనేత ఛాయ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టాశివనీలకంఠ రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. వార్డ్ ఇన్‌చార్జ్ కనికె నాగేంద్ర, రాష్ట్ర శాప్‌నెట్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆసుపత్రిలో భాగస్వాములు కావాలి



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



వృద్ధాశ్రమంలో మాట్లాడుతున్న కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఐఓ డాక్టర్ నాగప్రసాద్, అధికారులు, ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): . స్వచ్ఛ ఆసుపత్రిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు కోరారు.కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆసుపత్రి ఆవరణలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్క వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, రేడియాలజి హెచ్‌ఓడీ డాక్టర్ రాధారాణి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఎస్‌పీఎం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

కేఎంసీ ఆధ్వర్యంలో...

స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజి ఆధ్వర్యంలో స్థానిక సిల్వర్‌జూబ్లీ కళాశాల వెనుక ఉన్న మన వృద్ధాశ్రమంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించి వృద్ధులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ మాట్లాడుతూ ఆశ్రమంలోని వృద్ధులందరూ క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలని, ఆహారం విషయంలో వయస్సుకు తగ్గట్లుగా తినాలని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ, లెక్చరర్ ఇన్ సోషల్ సైన్సెస్ సురేష్‌కుమార్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలు పరిశుభ్రం చేశారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో డీఐవో డాక్టర్ నాగప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అరుణ, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎస్‌ఓ హేమసుందరం, డీపీహెచ్‌ఎన్‌ఓ అన్నపూర్ణమ్మ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ హైస్కూల్‌లో పినాక ఉచిత శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో పినాక కోర్స్ డైరెక్టర్ ఆర్ రవికుమార్, తదితరులు

కర్నూలు సిటీ: జిల్లాలో ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీటెక్, పీజీ, వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు నగరంలోని ఎన్‌ఆర్ పేట శ్రీలక్ష్మీ హైస్కూల్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పినాక ప్రజా సాధికార ట్రస్టు, ఐఆర్‌ఎస్ అధికారి బి.యాదగిరి, అమీలియో హాస్పటల్స్ అధినేత డా.లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత శిక్షణ తరగతులను పినాక కోర్స్ డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాయలసీమ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని యువతి, యువకులకు స్పోకెన్ ఇంగ్లిషు, ఇంటర్వ్యూ, కమ్యూనికేషన్ స్కీల్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, గ్రూప్స్, సివిల్స్ గైడెన్స్ తదితర అంశాల్లో ఏడేళ్ల నుంచి ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. పినాకలో శిక్షణ పొందిన ఎంతో మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారన్నారు. 21 రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులకు ఐఆర్‌ఎస్ అధికారి బి.యాదగిరి స్వయంగా కొన్ని రోజుల పాటు పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. భోజన వసతి, దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కూడా ఉచితంగా కలిప్తున్నామన్నారు. ఎవరైనా ఉచిత శిక్షణకు హాజరు కావాలని ఆసక్తి ఉన్న వారు అడ్మిషన్లకు 9177764147, 9640969891 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పినాక అధ్యాపకులు సునీతా రోజ్, స్వర్ణ, సంజన్న, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్‌లకు న్యాయం చేయాలి

ఆదోని సెంట్రల్: ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్‌లకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు ప్రతాప్‌రెడ్డి, భాస్కర్ ఆచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య ముఖ్య కార్యదర్శుల సమావేశాన్ని శనివారం స్థానిక నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదోన్నతుల ప్రక్రియలో మోడల్ ప్రైమరీ స్కూల్‌కు కేటాయించిన ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టును పాత విధానంలోని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టుగా పరిగణించి, సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. అర్హతలు ఉండి ఇప్పటికీ గ్రేడ్-2 లాంగ్వేజ్ పండితులుగా, వ్యాయామ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న వారికి న్యాయం చేయాలన్నారు. సమాంతరంగా తెలుగు మీడియం, మైనర్ మీడియంలను కొనసాగిస్తూ స్టాఫ్ ప్యాట్రన్ ప్రకారం ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ కుమార్, జంగం బసవరాజు, బడుగు బసవరాజు, దస్తగిరి, చంద్రమౌళి, మద్దయ్య, ఆనంద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.